సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం ၊ 14 ၊ మే ၊ 2025



ఈఓ నివేదికను తొక్కి పెట్టింది ఎవరు?
ప్రొద్దుటూరు పట్టణంలోని కోట్లరూపాయలు విలువైన ఆస్తులు గల శ్రీకృష్ణ గీతాశ్రమం నిర్వహణపై ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. - 8లో



సమస్యలను పరిష్కరించాలి
ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని కేవీ శివారెడ్డి డిమాండ్ చేశారు. - 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
39.2 /28.2
జిల్లాలో మంగళవారం 28.2 - 39.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరాబ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఫొటో, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసు, కారు డ్రైవింగ్‌లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువకులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1 నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణలో అభ్యర్థులు 18 నుంచి 45 ఏళ్లలోపు కలిగి ఉండాలన్నారు. దూర ప్రాంతల వారికి స్థానికంగా ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

రేపు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఉపాధి కార్యాలయం, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 9 గంటలకు కమలాపురంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురంలోని రెడ్డి కాలనీలోగల సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ జరిగే ఈ జాబ్‌మేళాలలో సుమారు 15 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. టెన్త్, ఇంటర్మీడియేట్, డిప్లొమా, ఐటీఐ, బీటెక్, ఎంటెక్, బి, ఎం, డీ ఫార్మసీ, డిగ్రీ, పీజీ చదివిన వారు అర్హులన్నారు. అభ్యర్థులు 18 నుంచి 35 ఏళ్లలోపు కలిగి ఉండాలని, ఎంపికైన వారికి హోదాను బట్టి రూ. 7 వేల నుంచి 26 వేల వరకు వేతనం ఉంటుందన్నారు.

వీఎస్‌అండ్‌ఎస్‌ఓగా ధర్మతేజ

కడప కోటిరెడ్డిసర్కిల్: కడపజోన్ విజిలెన్స్ సెక్యూరిటీ ఇన్‌చార్జి ఆఫీసర్‌గా ఓ.ధర్మతేజను నియమిస్తూ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్.ముజుబుర్ రెహ్మాన్‌ను సస్పెండ్ చేసిన విషయం విదితమే. ఆయ న స్థానంలో నెల్లూరు వీఅండ్ఎస్ఓగా పనిచేస్తున్న ధర్మతేజను ఇన్‌ఛార్జిగా నియమిస్తూ ఆర్టీసీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ధర్మతేజ 'సాక్షి'తో మాట్లాడుతూ ఈనెల 17న తాను బాధ్యతలు స్వీకరించనున్నట్లు వివరించారు.

ప్రజల ఆశలపై పచ్చనీడలు

మరో నెల రోజుల్లో ఖరీఫ్ సీజన్ పలకరించనుంది. దాంతోపాటే విద్యా సంవత్సరం తలుపు తట్టనుంది. ఇటు సాగు ఖర్చుల కోసం అన్నదాతలు.. అటు విద్యాసామగ్రి కోసం తల్లులు ఆశగా ఎదురుచూస్తున్న వేళ.. కూటమి ప్రభుత్వం కాడి దించేస్తోంది. అన్నదాత సుఖీభవ ఊసు లేక.. తల్లికి వందనంపై స్పష్టత ఇవ్వక వారి ఆశలపై 'పచ్చ' నీళ్లు కుమ్మరిస్తోంది. ఏడాది కూటమి పాలనలో ఇటు అభివృద్ధి లేక.. అటు సంక్షేమం కానరాక ప్రజల బతుకు ఎడారిగా మారింది.

- అన్నదాత సుఖీభవ పథకానికి మోక్షం లభించేనా?
- తల్లికి వందనం పథకం అందరికీ వర్తింపుపై అనేక అనుమానాలు
- సాగు సాయం కోసం రైతుల ఎదురుచూపులు
- ప్రభుత్వ తీరుపై ఆందోళన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు





సేద్యం చేస్తున్న రైతులు

కడప ఎడ్యుకేషన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తోంది. నేటికీ పెన్షన్లు మినహా సూపర్ సిక్స్ హామీలు అమలుకాని పరిస్థితి నెలకొంది. అటు అన్నదాత సుఖీభవ సాయం అందక రైతులు.. తల్లికి వందనం రాక విద్యార్థుల తల్లులు ఆందోళన చెందుతున్నారు. పథకాలకు సంబంధించిన నిధుల విడుదల అదిగో ఇదిగో అంటూనే ఏడాదిపాటు కాలయాపన చేసింది కూటమి ప్రభుత్వం. మరి ఈ ఏడాదైనా పథకాలు సక్రమంగా అమలవుతాయా లేక మళ్లీ కాలయాపనేనా అని పలువురు లబ్ధిదారులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే పథకాలు వస్తాయనుకున్న ప్రజల ఆశలు అడియాసలే అయ్యాయి.

మరో 20 రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. రైతన్నలు సాగుకు సన్నద్ధం కావాల్సిన సమయమిది. మరి ఈసారైన ప్రభుత్వం కరుణిస్తే రైతులకు పెట్టబడి ఖర్చులు కలిసొస్తాయి. లేకుంటే మళ్లీ అప్పులకు అడుగలేయక తప్పదని పలువురు రైతన్నలు అంటున్నారు. మరి ప్రభుత్వం కరుణిస్తుందా లేక కాలయాపనతో సరిపెడతుందా అని అన్నదాతలు ఎదురు చూస్తున్నారు.

ఏడాది నుంచి అన్నదాతలకు తప్పని కష్టాలు...

గత ఏడాది నుంచి అన్నదాతలకు కష్టాలు తప్పలేదు. అటు అనావృష్టి, ఇటు అతివృష్టి కారణంగా ఈ ఏడాది రైతులు పూర్తిస్థాయిలో దెబ్బతిని పెట్టుబడి ఖర్చులు కూడా రాని పరిస్థితి నెలకొనడంతో అన్నదాతలు ఆందోళన చెందారు. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ పథకాలను అమలు చేసినా లబ్ధిదారులకు చేయూతగా ఉండేది. అటువైపు నుంచి సహకారం అందకపోడంతో అన్నదాతలు నిండామునగాల్సిన పరిస్థితి నెలకొంది. పైగా పండిన అరకొర పంట దిగుబడులకు కూడా గిట్టుబాటు ధర లేక నానా అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఈ ఏడాదైనా పథకాలను అమలు చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గత ప్రభుత్వం ఆరంభంలోనే పెట్టుబడిసాయం..

రైతులు పంటలసాగు కోసం ఎలాంటి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్ ఆరంభంలోనే పెట్టుబడి సాయం (వైఎస్సార్ రైతు భరోసా) అందించి అన్నదాతలకు అండగా నిలిచింది. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తన్ని అందించింది. పీఎం కిసాన్ సాయం కింద రూ. 6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ. 7500 మొత్తం కలిపి ఏడాదికి రూ. 13500 రైతు ఖాతాలకు జమ చేసేది. ఇలా వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద ఐదేళ్లపాటు రూ. 1191.03 కోట్లను అన్నదాతలకు అందించి అండగా నిలిచింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి రైతుకు ఏడాదికి రాష్ట్రవాట కింద రూ. 14 వేలు అందిస్తామని ప్రకటించింది. కానీ ఏడాది ముగిసినా ఆమాటే లేదు. పైసా విదిల్చలేదు.

అమ్మ ఒడి పథకంతో..

గత ప్రభుత్వం 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అమ్మ ఒడి పథకాన్ని అమలు చేశారు. నాలుగేళ్లలో ఈ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా ముందుగానే క్యాలెండర్‌ను ప్రకటించి తల్లుల ఖాతాలకు నగదును జమచేసింది. జిల్లావ్యాప్తంగా అన్ని, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 1,80,203 మంది తల్లులకు నగదు అందించింది. గతంలో కుటుంబంలో ఒక బిడ్డకు మాత్రమే ఈ పథకాన్ని వర్తింప చేసింది. ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం ఎంతమంది పిల్లలుంటే అందరికి అమ్మ ఒడి అన్ని చెప్పారు. మరి ఇది అమలు జరుగుతుందా లేక ఎదురు చూపులేనా అన్ని పలువురు తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చెల్లించిన రైతు భరోసా, పీఎం కిసాన్ నిధుల వివరాలు ఇలా..

సంవత్సరం	రైతుల సంఖ్య	విడుదలైన నిధులు (కోట్లలో)
2019-20	206708	279.93
2020-21	208747	280.06
2021-22	199344	269.11
2022-23	202598	235.68
2023-24	210481	126.25

గత ప్రభుత్వం అమ్మ ఒడి పథకం కింద చెల్లించిన నిధులు వివరాలు...

సంవత్సరం	తల్లుల సంఖ్య	జమచేసిన మొత్తం కోట్లలో
2019-20 (51 మండలాలు)	2,55,587	383.38
2022-21 (51 మండలాలు)	2,68,076	402.11
2021-22 (36 మండలాలు)	1,87,742	281.61
2022-23 (36 మండలాలు)	1,80,203	270.30
మొత్తం	8,91,608	1337.40



దీక్షిత్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

విషాద సెలవులు!

ఆటపాటలతో.. అల్లరి చేష్టలతో ఆనందంగా గడపాల్సిన సెలవు రోజులు.. విషాదంగా మారిపోయాయి. కన్నవారికి జీవితాంతం చెరగని చేదు జ్ఞాపకాలుగా మిగిలిపోయాయి..

అమ్మమ్మ ఒళ్లో నిదురోతారని... తాతయ్యతో కబుర్లెన్నో చెబుతారని ఆశతో పిల్లలను ఊరికి పంపించారు.. అత్తమ్మ చేసిన వంటలు తింటూ.. మామయ్యతో ముచ్చట్లాడుకుంటుంటారని కలలుగన్నారు.

పల్లె'టూరు'కెళ్లి.. పచ్చని పొలాల్లో విహరిస్తారని మురిసిపోయారు. చిన్నప్పుడు తాము తిరిగిన వీధుల్లో నడిచి.. బోలెడు జ్ఞాపకాలు ఒడిసి పట్టుకొస్తారని ఆ తల్లిదండ్రులు ఆశ పడ్డారు. ఇంటికొచ్చాక ఒక్కొక్కటీ చెబుతుంటే వింటూ మురిసిపోవాలని ముచ్చటపడ్డారు.

విధి మాటేసిన విషయం పసి గట్టలేకపోయారు. పసి పిల్లలను ఇంత కర్కశంగా చిదిమేస్తుందని.. 'ఈత' రూపంలో మృత్యు గీతం రాస్తుందని ఊహించలేకపోయారు.


చిన్నారులపై ఎవరి దిష్టి తగిలిందో.. ఏ దుష్టశక్తి ఆవహించిందో గానీ చెరువు దగ్గరకు ఐదుగురూ తోడుగా వెళ్లారు.. ముందు ఎవరు దిగారో.. ఏమైందో మెల్లగా చెరువులోకి జారుకున్నారు. తాము వెళ్లేది చెరువులోకి కాదని.. మృత్యు ఒళ్లోకి అని తెలిసుండదు పాపం..

ఒక్కో ఘడియ గడుస్తోంది.. నిమిషాలు.. గంటలు దాటుతున్నాయి. చూస్తుండగానే చీకటి పడింది.. పిల్లలేమో ఇంటికి రాలేదు. అవ్వ ముఖంలో దిగులు కమ్ముకుంది. అత్తామామల మనసుల్లో కలవరం మొదలైంది. పిల్లలు ఇంటికి రాని విషయం ఊరిలో ఉన్న తల్లిదండ్రులకు చేరింది. కాసేపటికే 'చావు' కబురు చెవినపడింది. అంతే.. ఒక్కసారిగా వారిపై పిడుగుపడ్డటయ్యింది. వారి గుండె పగిలి 'చెరువైంది' సెలవుల్లో ఆడుకుంటామని చెప్పి.. సెలవంటూ వెళ్లిపోతారా.. అంటూ రోదిస్తుంటే కంటి చెరువు తెగి నీటి ధార పొంగి పారింది.

పల్లెటూరి జ్ఞాపకాలు.. పచ్చని పొలాల కబుర్లు ఎవరు చెబుతారంటూ కన్నవారి హృదయాలు గుచ్చి గుచ్చి ప్రశ్నిస్తుంటే.. ఆ తల్లిదండ్రుల ప్రశ్నలకి జవాబు చెప్పేదెవరు.. వారి కడుపుకోతను తీర్చేదెవరు..? ఆ చేదు జ్ఞాపకాలకు మందు పూసేదెవరు.. ?

పిల్లోల్ల ఈత సరదా .. కన్నోళ్లకు కడుపుకోత మిగిల్చిన ఈ విషాద ఘటన బ్రహ్మంగారి మఠం మండలంలో చోటు చేసుకుంది. మల్లేపల్లె చెరువులో మంగళవారం సాయంత్రం ఈత కోసం వెళ్లి ఐదుగురు చిన్నారులు మృత్యువాత పడిన ఘటన నాలుగు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది.

- బ్రహ్మంగారి మఠం



హర్ష (12) (ఫైల్)



దీక్షిత్(12) (ఫైల్)



చెరువు దగ్గర గుమికూడిన ప్రజలు



గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్

పేకాట ఆర్గనైజర్ వెంట 'డబుల్ స్టార్' అధికారి

- చెట్టాపట్టాలేసుకుని సింగపూర్‌కు పయనం
- ఎంచక్కా జాలీగా సాగిన ట్రిప్

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కడప-కర్నూలు, చిత్తూరు-అన్నమయ్య జిల్లాలకు మోస్ట్ వాంటెడ్ గ్యాంబ్లర్ అయిన అశోక్ రెడ్డి గతంలో చాలా కేసుల్లో గ్యాంబ్లింగ్ ఆర్గనైజర్ గా ఉండి చాలా కుటుంబాల అధోగతికి కారకుడై ఉన్నాడు. 10 రూపాయలు, 20 రూపాయలు వడ్డీ తో పేకాట రాయుళ్లకు డబ్బు ఇచ్చి వారి తోనే పేకాట ఆడించి ఎంతో మంది జీవితాలతో ఆడుకుంటున్నాడు. అలాంటి వ్యక్తితో ఇటీవల కడప జిల్లాలోని 'డబుల్ స్టార్' అధికారి చెట్టాపట్టాలేసుకుని సింగపూర్ వెళ్లారు. కాగా ఈ ఎస్ఐ కడప జిల్లాలో.. జిల్లా పోలీస్ అధికారి తర్వాత అంతా... తానే అంటూ అన్ని పోలీస్ స్టేషన్‌లలో ఎస్ఐల నియామకాలలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో తన ఉనికిని చాటుకుంటున్నారు. తనకు అనుకూలంగా లేని, తన నామస్మరణ చేయని వారిని, నిక్కచ్చిగా పనిచేసే కొంతమంది నియామకాల విషయంలో అడ్డు తగులుతూ వారికి పోస్టింగులు లేకుండా చేస్తూ ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ×డబుల్ స్టార్¥ అధికారి సింగపూర్‌లో గ్యాంబ్లర్ అశోక్ రెడ్డి ఫ్యామిలీతో తన ఫ్యామిలీ కూడా ఉండి విలాసంగా గడుపుతున్నారు. మంగళవారం ఒకే విమానంలో తిరుగు ప్రయాణం కాబోతున్నట్లు సమాచారం. ఇలాంటి సంఘ వ్యతిరేక శక్తులతో తమ కుటుంబాల విలాసాల కోసం అవసరాల కోసం దగ్గరికి తీస్తూ వారు ఇచ్చే లంచాలకు అలవాటు పడి పోలీస్ వ్యవస్థ ఔన్నత్యాన్ని దిగజారుస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. గతంలో కడపలో పనిచేసిన ఈయన.. పనిచేసిన ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో గ్యాంబ్లర్ అశోక్ రెడ్డి ద్వారా పెద్ద ఎత్తున జూదం నడిపించేవారు. అధిక మొత్తంలో డబ్బులు గడించారని అప్పటి అధికారులు, ప్రస్తుత అధికారులు అతనిని మందలించారనీ.. అయినా అతని పద్ధతి మార్చుకోలేదని వినికిడి. కడప, అన్నమయ్య, నంద్యాల జిల్లాలలో పాటు, తాడిపత్రి తో సహా పేకాట శిబిరాలు నిర్వహించి వచ్చిన డబ్బుతో జల్సా చేసేందుకు వారి అవినాభావ సంబంధంకు గుర్తుగా ఈ ట్రిప్ కొనసాగుతోందని సమాచారం. పైకి మాత్రం ఈ ఎస్ఐ తన ఫ్యామిలీతో సింగపూర్‌కు వెళ్లి వచ్చేందుకు ఉన్నతాధికారుల అనుమతిని సైతం తీసుకోవడం తానంతా 'నిప్పే'నని చెప్పుకునేందుకు ఇచ్చిన 'కలరింగ్' అని ప్రజలు అనుకుంటున్నారు.

- డబుల్ స్టార్ తన ఫ్యామిలీతో గ్యాంబ్లర్ అశోక్‌రెడ్డి కుటుంబంతో పాటు సింగపూర్‌కు వెళ్లి, వస్తున్న విమాన సర్వీసుల వివరాలిలా వున్నాయి. వారు చెన్నై - సింగపూర్ ప్రయాణించిన విమానం నెంబర్: ఎస్‌క్యూ 529. కాగా.. సింగపూర్ ఎయిర్‌లైన్స్ విమానం సర్వీసు నెంబర్: ఎస్‌క్యూ 528, సింగపూర్ నుంచి మంగళవారం రాత్రి 20:25 గంటలకు బయలుదేరి, చెన్నైకి చేరుకుంటారని విశ్వసనీయ సమాచారం.

కె.కె.కొట్టాల గ్రామస్తులకు న్యాయం చేయండి

- టెయిలింగ్ పాండ్‌తో పంటలు పండక నష్టపోతున్నారు
- కలెక్టర్‌ను విన్నవించిన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న కె.కె.కొట్టాల గ్రామస్తులు

వేముల : యురేనియం బాధిత గ్రామమైన కె.కె.కొట్టాల గ్రామస్తులకు న్యాయం చేయాలని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు విజ్ఞప్తి చేశారు. మండలంలోని కె.కె.కొట్టాల గ్రామస్తులు మంగళవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని కలిసి టెయిలింగ్ పాండ్‌తో పడుతున్న ఇబ్బందులను, సమస్యలపై వినతి పత్రం అందజేశారు. దీంతో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బాధిత రైతులను వెంట బెట్టుకుని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన టెయిలింగ్ పాండ్‌తో కె.కె.కొట్టాల గ్రామస్తులు నష్టపోతున్న తీరును, గ్రామస్తుల ఇబ్బందులను ఇబ్బందులను కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే టెయిలింగ్ యురేనియం వ్యర్థాలతో నిండిపోయిందని, కాలుష్యం వల్ల గ్రామస్తులు అనారోగ్యానికి గురవుతున్నారని విన్నవించారు. టెయిలింగ్ పాండ్ నిండిపోవడంతో టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచే పనులు చేస్తున్నారని, టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచితే గ్రామస్తులు ఇంకా తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని వివరించారు. ఇప్పటికే గ్రామస్తులు తమ సమస్యలను పరిష్కరించేంతవరకు టెయిలింగ్ పాండ్ పనులు చేపట్టవద్దని పనులను అడ్డుకున్నారని పేర్కొన్నారు. వ్యర్థ పదార్థాల టెయిలింగ్ పాండ్‌తో నష్టపోతున్న కె.కె.కొట్టాల గ్రామాన్ని యూసీఐఎల్ తీసుకుని పునరావాసం, ఉద్యోగాలు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద నష్ట పరిహారం అందించాలని కోరారు. దీనికి స్పందించిన కలెక్టర్ శ్రీధర్ టెయిలింగ్ పాండ్‌తో నష్టపోతున్న కె.కె.కొట్టాల గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు బాధిత రైతులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రంగనాథం, బాధిత రైతులు పాల్గొన్నారు.

మున్సిపల్ విభాగ బలోపేతానికి కృషి చేయాలి

కడప కార్పొరేషన్ : జిల్లాలో వైఎస్సార్‌సీపీ మున్సిపల్ విభాగాన్ని బలోపేతం చేయడానికి కృషి చేయాలని కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చిన ఎంపీని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి వై. శ్రీరంజన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పదవి రావడానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మున్సిపాలిటీల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, తద్వారా పార్టీని పటిష్టం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఆర్‌టీఐ వింగ్ జిల్లా అధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి, ఐస్‌క్రీం రవి, రెడ్డి ప్రసాద్, వెంకటేష్ పాల్గొన్నారు.

హోమియో గతి.. ఇంతే!

కడప హోమియోపతి కళాశాలకు గ్రహణం పట్టింది. రాయలసీమ కేంద్రంగా కడపలో ఏర్పాటైన ప్రభుత్వ హోమియోపతి కాలేజీ విసిరేసినట్లుగా కడప నగరానికి దూరంగా ఉంది. దీనికి అనుసంధానంగా ప్రభుత్వ హోమియోతి ఆసుపత్రి పాత రిమ్స్‌లో నడుస్తోంది. ఈ నేపథ్యంలో ఆసుపత్రికి అందుబాటులో ఉండాలని, హోమియోపతి కాలేజీ నూతన భవన నిర్మాణానికి చర్యలు చేట్టారు. వైఎస్సార్ సీపీ పాలనలో శరవేగంగా జరిగిన పనులు.. కూటమి ఏలుబడిలో నత్తను తలపిస్తున్నాయి.

- ప్రభుత్వ హోమియోపతి కాలేజీ బిల్డింగ్ నిర్మాణం ఏమైంది!
- కూటమి పాలనలో పడకేసిన అభివృద్ధి పనులు
- 'ఆయిష్'యూనివర్శిటీపై కూడా నీలి నీడలు





కడప పాత రిమ్స్‌లో హోమియోపతి మెడికల్ కాలేజీ కొత్త భవనాలకు కేటాయించిన స్థలం

కడప రూరల్ : రాయలసీమకు కేంద్రంగా కడప నగరంలోని మరియాపురం ప్రాంతంలో 1982లో ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కాలేజీ ప్రారంభమైంది. ఈ మెడికల్ కాలేజీ కడప నగరానికి దాదాపు 5 కిలో మీటర్ల దూరంలో ఉంది. కాలేజీకి సంబంధించిన ఆసుపత్రి మాత్రం పాత రిమ్స్‌లో ఏర్పాటైంది. మెడికల్ కాలేజీ కూడా ఆసుపత్రికి అనుసంధానంగా దగ్గరలో ఉంటే ప్రయోజనంగా ఉంటుందని కొంత మంది భావించారు. ఈ అంశాన్ని అప్పటి ఆయుష్ కమీషనర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన 2024 మార్చిలో ఇక్కడికి వచ్చి హోమియోపతి ఆసుపత్రిని పరిశీలించారు. ఈ ఆసుపత్రికి ఎదురుగా ఉన్న స్థలంలో మెడికల్ కాలేజీకి కొత్త భవనం ఏర్పాటు చేస్తే బాగుంటుందని ప్రభుత్వానికి సూచించారు. ఆ మేరకు ప్రభుత్వం 50 సెంట్ల స్థలాన్ని కేటాయించింది. ఇందుకోసం అక్కడ ఉన్న పాడుబడిన భవనాలను తొలగించారు.

మొదట 50 సెంట్ల స్థలంలో కొత్త భవనాల నిర్మాణాలకు రూ.5 కోట్లు సరిపోతుందని భావించారు. ఆ మేరకు నాటి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రూ.5 కోట్ల నిధులను మంజూరు చేశారు. కడపలోని ఏపీ ఎంఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) వారు నిర్మాణాలకు రూ.24 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఆ లోపే ఎన్నికల కోడ్ రావడంతో ఆ పనులు అంతటితో ఆగిపోయాయి. ఎన్నికల తరువాత టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైద్య రంగం అభివృద్ధి వైపు పరుగులు తీసింది. టీడీపీ ప్రభుత్వం పాలనలో 'చంద్రగ్రహణం'పట్టిందనే ఆరోపణలు ఉన్నాయి.

అనుసంధానంతో ప్రయోజనాలు...

ఈ ఆసుపత్రికి అనుసంధానంగా దగ్గరలోనే మెడికల్ కాలేజీ భవనం ఏర్పాటు కావడంతో మెడికోలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. మెడికల్ కాలేజీ విద్యార్థులు తమ కోర్స్‌ను అభ్యసించడంలో భాగంగా ఆసుపత్రికి వచ్చే రోగులను పరీక్షించాల్సి ఉంటుంది. అంటే మరియాపురం ప్రాంతంలో ఉన్న మెడికల్ కాలేజీ నుంచి నగరంలో పాత రిమ్స్‌లో ఉన్న ఆసుపత్రికి రావాలంటే చాలా కష్టంతో కూడిన పని. మెడికల్ కాలేజీలో ఏటా ఒక ఏడాదికి ఒక బ్యాచ్‌కు నాలుగున్నర సంవత్సరాల కోర్స్‌కు సంబంధించిన 38 మంది, బీహెచ్ఎంఎస్ (బ్యాచులర్ ఆఫ్ హోమియోపతి మెడిసిన్ అండ్ సర్జన్), యూజీ (అండర్ గ్రాడ్యుయేట్స్). మూడేళ్ల కోర్స్‌కు సంబంధించి 8 మంది పీజీ స్టూడెంట్స్ హోమియోపతి వైద్య విద్యను అభ్యసిస్తుంటారు.

సన్నగిల్లుతున్న 'ఆయుష్'యూనివర్సిటీ ఆశలు

కడపకు ప్రతిష్టాత్మకమైన 'ఆయుష్'యూనివర్శిటీ వచ్చే అవకాశం ఉందనే సంకేతాలు వచ్చాయి. ఆయుష్ పరిధిలోకి ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధయోగ, హోమియోపతి విభాగాలు వస్తాయి. ఈ ఆయుష్ యూనివర్శిటీ ఏర్పాటు వల్ల అన్ని విభాగాలకు చెందిన పరిపాలనా అంశాలు ఉంటాయి. అలాగే ఆయుష్‌కు సంబంధించి మందుల తయారీ యూనిట్ ఏర్పాటుకు ఆస్కారం ఉంటుంది. ఇలా యూనివర్శిటీ ఏర్పాటు వల్ల ఆయుష్ విభాగాలు అభివృద్ధి చెందడానికి దోహదపడనుంది. ఈ యూనివర్శిటీ ఏర్పాటుకై అందుకు సంబంధించిన ఉన్నతాధికారులు 2024లో కడపకు వచ్చి పరిశీలించారు. సానుకూలతను వ్యక్తం చేసి వెళ్లారు. కాగా దేశంలో ఇప్పటి వరకు ఆయిష్‌కు సంబంధించి ప్రభుత్వ యూనివర్శిటీ గుజరాత్‌లోని గోరఖ్‌పూర్‌లో మాత్రమే ఉంది. ప్రైవేట్ రంగానికి సంబంధించి 13 యూనివర్శిటీలు ఉన్నాయి. కాగా ఈ అంశాలపై టీడీపీ కూటమి ప్రభుత్వం స్పందించి త్వరితగతిన చర్యలు చేపడితే ఫలితం ఉంటుంది. ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలని ఆ శాఖకు చెందిన వైద్యులు, ఉద్యోగులు అనుకుంటున్నారు.

ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు

హోమియోపతి మెడికల్ కాలేజీ కొత్త భవనాల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఇదివరకే ప్రభుత్వానికి పంపించాం. అక్కడి నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– డాక్టర్ సాంబమూర్తి, ప్రిన్సిపల్, ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కాలేజీ, కడప

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతాం

ఈ అంశానికి సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఉన్నతాధికారులు ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతాం

– శ్రీనివాసులురెడ్డి, ఈఈ, ఏపీ ఎంఎస్ఐడీసీ, కడప

ఈఓ నివేదికను తొక్కిపెట్టింది ఎవరు?

- గీతాశ్రమంపై కోర్టుకు వెళ్లిన వారికే భవనాలు లీజుకు
- నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న అధికారులు


ప్రొద్దుటూరులోని శ్రీకృష్ణ గీతాశ్రమం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణంలోని కోట్లరూపాయలు విలువైన ఆస్తులు గల శ్రీకృష్ణ గీతాశ్రమం నిర్వహణపై ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. తద్వారా ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నా చర్యలు తీసుకునే వారు కరువయ్యారు. పట్టణానికి చెందిన నామా ఎరుకలయ్య 1946లో లోక కల్యాణార్థం ఆశ్రమాన్ని నెలకొల్పారు. సంస్థ ద్వారా పేద విద్యార్థులకు ఉచిత విద్య, భోజన సదుపాయం, వసతి ఏర్పాటు చేయడం, గో సంరక్షణ, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం, భగవద్గీతను ప్రచారం చేయడం ఆయన ప్రధాన ఆశయాలు. అనంతరం 1982 జనవరి 1న ఆశ్రమానికి సంబంధించిన ఆస్తులన్నింటినీ దేవాదాయ ధర్మాదాయ శాఖకు అప్పగించి ఆయన ఫౌండర్ ట్రస్టీగా ఉండేవారు. 1989లో ఈ ఆశ్రమాన్ని చిత్తూరు జిల్లా ఏర్పేడులోని శ్రీవ్యాసాశ్రమంలో చేర్చారు. ఆశ్రమ నిర్వహణకు సంబంధించి ఆర్థిక లావాదేవీల్లో పలు ఆరోపణలు రావడంతో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ శ్రీవ్యాసాశ్రమం దత్తత నుండి తప్పించి ప్రత్యేకంగా ఈఓను నియమించారు. 2017 జూన్ 19వ తేదీ నుండి ఈఓ ద్వారానే ఆశ్రమం కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. మొత్తం ఆశ్రమ నిర్వహణకు సంబంధించి కమిషనర్ ఆదేశాల మేరకు గతంలో ఈఓగా పనిచేసిన శంకర్ బాలాజీ ఒక నివేదికను తయారు చేసి పంపారు.

కోర్టును ఆశ్రయించిన వారికే లీజుకు..

గీతాశ్రమం ప్రాంగణంలోని శారద జూనియర్ కాలేజీకి సంబంధించి మూడేళ్ల కాలపరిమితి ముగియడంతో 2021 ఆగస్టు 12న ఈ భవనాలకు అధికారులు వేలం పాట నిర్వహించారు. ఈ బహిరంగ వేలంలో కళాశాల యాజమాన్యం ప్రతినిధులు ఎవరిని పాట పాడనివ్వకుండా, వారు పాల్గొనకుండా వాయిదా వేయించారు. తమ కళాశాలకే ఈ భవనం 11 ఏళ్లపాటు లీజుకు కావాలని లేఖ సమర్పించారు. గతంలో కేవలం రూ.16,500 మాత్రమే కళాశాల యాజమాన్యం అద్దె చెల్లిస్తుండగా దీనిని 33 శాతం పెంచి రూ.21,945 ప్రకారం అద్దె చెల్లించాలని కమిషనర్ ఆదేశించారు. పలు మార్లు నోటీసులు ఇచ్చినా యాజమాన్యం స్పందించకపోగా ఏ ప్రకారం అద్దె చెల్లిస్తారో చెప్పలేదని ఈఓ నివేదికలో పేర్కొన్నారు. స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ అయిన ప్రొద్దుటూరులో ప్రభుత్వ నిబంధనల ప్రకారం చదరపు అడుగుకు రూ.5.50 చొప్పున అద్దె చెల్లించాల్సి ఉండగా కేవలం రూ.2.45 మాత్రమే చెల్లిస్తున్నట్లు నివేదికలో తెలిపారు. ముందుగా కళాశాల యాజమాన్యానికి, దేవాదాయశాఖకు ఎలాంటి కోర్టు కేసులు లేకపోగా.. కళాశాల కరస్పాండెంట్ ఎం.సురేష్‌బాబు పలు ఆరోపణలు చేస్తూ హైకోర్టులో రెండు కేసులు వేశారు. ఈ కేసులను సైతం హైకోర్టు కొట్టివేసింది. ఆశ్రమంలోని బీఈడీ కళాశాల, డైట్ కళాశాలలను ఏర్పాటు చేసి గతంలో దేవాదాయశాఖ వారికి అప్పగించారు. కాగా 2020లో గంగాధరానందగిరి స్వామి మరణానంతరం అక్రమంగా ఈ భవనాలను స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో కోర్టులో కేసు వేశారు. శారద జూనియర్ కళాశాల కరస్పాండెంట్ నిర్వాకం వలన ప్రతి నెల సుమారు రూ.30వేలు ఆశ్రమానికి నష్టం వాటిల్లుతోందనే విషయాన్ని ఈఓ ఉన్నతాధికారులకు తెలిపారు. ఇది ఇలా ఉండగానే ప్రస్తుత అధికారులు గీతాశ్రమంపై కోర్టులో కేసు వేసిన ఎం.సురేష్‌బాబుకు ఈ ఏడాది ఫిబ్రవరి 8న బహిరంగ వేలం నిర్వహించినట్లుగా ప్రకటించి భవనాలను అద్దెకు ఇచ్చారు. వాస్తవానికి ఆశ్రమంపై కోర్టుకు వెళ్లిన వ్యక్తికి తిరిగి ఎలా బహిరంగ వేలం ద్వారా ఎలా అద్దెకు ఇస్తారన్న విషయంపై విచారణ చేపట్టాల్సి ఉంది. గతంలో అధికారులు తొలగించిన కార్యాలయ సిబ్బంది జనార్దన్‌ను ప్రస్తుతం తిరిగి విధుల్లోకి తీసుకోవడమే కాకుండా ఆయనకు ఏకంగా పాత బకాయిలను కూడా చెల్లించడం వెనుక మర్మం ఏమిటో తెలియడం లేదు. ప్రస్తుతం పనిచేస్తున్న ఈఓ రామచంద్రాచార్యులు ఈనెలాఖరున పదవీ విరమణ చెందనున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు గత ఈఓ సమర్పించిన నివేదికను పరిశీలించడంతోపాటు క్షేత్రస్థాయిలో పూర్తి వివరాలను తెలుసుకుని ప్రభుత్వానికి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

క్లుప్తంగా

ముత్యపు పందిరిపై నారాపుర స్వామి


ముత్యపు పందిరి వాహనంపై సతీసమేతంగా దేవదేవుడు

జమ్మలమడుగు : ముత్యపు పందిరి వాహనంపై నారాపుర వెంకటేశ్వరస్వామి దర్శనం ఇచ్చారు. మంగళవారం ఉదయం భూదేవి, శ్రీదేవి సమేతంగా ముత్యపు పందిరిపై స్వామి వారిని పల్లకిలో ఊరేగించారు. భక్తుల కోలాటం, గోవింద నామ స్మరణ, అన్నమాచార్యకీర్తల మధ్య ఊరేగింపు కోలాహలంగా సాగింది. సాయంత్రం సింహ వాహనంపై స్వామి వారు పట్టణంలో ఊరేగి తిరిగి నారాపుర స్వామి ఆలయానికి చేరుకున్నారు. దేవదేవుడు సతీసమేతంగా పురవీధుల గుండా పల్లకిలో వెళుతుండగా భక్తులు హారతులు ఇవ్వడంతో పాటు పూజలు నిర్వహించారు.

తూకాల్లో మోసాలకు పాల్పడవద్దు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడ్డ వద్దని జిల్లా లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ మెట్రాలజీ డే సందర్భంగా మంగళవారం నగరంలోని తూనికలు, కొలతల శాఖ కార్యాలయంలో రైస్, ఆయిల్ మిల్లర్స్, మండీ మర్చంట్ అసోసియేషన్ వారికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోదారులే వ్యాపారానికి శ్రీరామ రక్ష అన్నారు. అందువల్ల తూకాల్లో నాణ్యత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక ఆత్మహత్య

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వైఎస్‌ఆర్ కాలనీలో బాలిక సోమవారం రాత్రి ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు చిన్న చౌక్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. వైఎస్‌ఆర్ కాలనీకి చెందిన షేక్ సల్మా (14) తండ్రి గత ఏడాది చనిపోవడంతో బాలిక ఇంటి వద్దనే ఉంటోంది. సెల్ ఫోన్‌లో ఇన్‌స్టాగామ్ ఎక్కువ చూస్తుండడంతో బాలిక తల్లి మందలించినట్లు తెలిపారు. దీంతో బాలిక తీవ్ర మనస్తాపం చెంది ఎవరూ లేనప్పుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

వరదాయపల్లెలో చోరీ

మైదుకూరు : మైదుకూరు మండలం వరదాయపల్లెలో ఓ ఇంటిలో చోరీ జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన చిన్రెడ్డి ఆదినారాయణరెడ్డి అనే వ్యక్తి ఇంటిలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆదినారాయణ రెడ్డి భార్య లక్ష్మీదేవి బంధువుల ఇంటికి ఖాజీపేటకు వెళ్లారు. బీరువాలో ఉంచిన సుమారు ఆరు తులాల బంగారు వస్తువులను చోరీ చేసినట్టు తెలుస్తోంది. మైదుకూరు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం సభ్యులు కూడా చోరీ జరిగిన ఇంటిని పరిశీలించి వేలి ముద్రలను సేకరించారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలకు రక్షణ లేదు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎన్. శివరామ్

కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వంలో బీసీలకు, మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు నేట్లపల్లి శివరామ్ అన్నారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో బీసీ నాయకులు బసవరాజు, సుబ్బారాయుడు లతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అంబేద్కర్ రాజ్యాంగాన్ని కాలరాసి రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తోందని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతల మీద అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపే పనిలో నిమగ్నమయ్యారని విమర్శించారు. మాజీమంత్రి, బీసీ సామాజిక వర్గానికి చెందిన విడదల రజని పట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుబ్బానాయుడు దురుసుగా ప్రవర్తించడాన్ని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రౌడీలా వ్యవహరించిన సీఐని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ నాయకుడు సింధే రవిచంద్రరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


ఆర్‌ఎం కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూఏ నాయకులు, ఉద్యోగులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు సత్వర చర్యలు చేపట్టాలని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీ శివారెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కడప డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉద్యోగులు ఛలో డీపీటీఓ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆర్‌ఎం కార్యాలయం ఎదుట ఉద్యోగులు, కార్మికులు బైఠాయించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నినదించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ వైద్య సేవలకు సంబంధించి ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కొత్త బస్సులు కొనుగోలు, సిబ్బంది నియామకం, ఎలక్ట్రికల్ బస్సులు ఏపీఎస్ ఆర్టీసీ స్వయంగా కొనుగోలు చేయాలని కోరుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం తమ సమస్యలను పరిష్కరించేలా సత్వర చర్యలు చేపట్టాలని, అవసరమైతే సమ్మెలోకి వెళ్లేందుకైనా సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి భద్రావతమ్మ, కడప రీజినల్ కార్యదర్శి సుధాకర్, రీజినల్ ప్రెసిడెంట్ నాగముని, అసిస్టెంట్ సెక్రటరీలు సుబ్బారావు, నాగరాజుతోపాటు అన్ని డిపోల అధ్యక్ష కార్యదర్శులు, గ్యారేజ్ అధ్యక్ష కార్యదర్శులు, సీసీఎస్ డెలిగేట్లు, భారీ సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

పలు కేసుల్లో నిందితులకు రిమాండ్

కాశినాయన : మండలంలో గ్యాంబ్లింగ్, డ్రంక్‌అండ్‌డ్రైవ్ కేసులో ఆరుగురు నిందితులను కోర్టులో హాజరు పరచగా ఒక రోజు జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. ఎవరైనా గ్రామాల్లో గ్యాంబ్లింగ్, అక్రమ మద్యం అమ్ముతున్నా తమ దృష్టికి తీసుకు రావాలని ఆయన కోరారు.

రెండు బైకులు ఢీ

ఇరువురికి గాయాలు

మైదుకూరు : మైదుకూరు – బద్వేలు రహదారిలోని మున్సిపాలిటీ పరిధి గడ్డంవారిపల్లె సమీపంలో మంగళవారం రెండు బైకులు ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. మైదుకూరుకు చెందిన ఎస్‌పీ సుబ్రహ్మణ్యం బద్వేలు మున్సిపాలిటీలో పనిచేస్తూ ఉదయం విధులకు మోటార్ బైక్‌పై బయల్దేరాడు. బద్వేలు సమీపంలోని లక్ష్మీపాలెం గ్రామానికి చెందిన సంజీవ్ కుమార్ బైక్‌పై మైదుకూరుకు వస్తున్నాడు. వీరు ఇరువురి బైకులు గడ్డంవారిపల్లె వద్ద ఢీకొన్నాయి. సంఘటనలో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో ఇద్దరిని ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన సుబ్రహ్మణ్యంను మెరుగైన చికిత్స కోసం అక్కడి నుండి కర్నూలుకు తీసుకెళ్లారు.

రైలు కింద పడి వృద్ధుడి మృతి


బాలమ్మగారి చెన్నారెడ్డి (ఫైల్)

కడప కోటిరెడ్డిసర్కిల్ : తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి సమీపంలో వైఎస్సార్ జిల్లాకు చెందిన ఓ వృద్ధుడు రైలు కిందపడి మృతి చెందినట్లు రేణిగుంట ఎస్ఐ తెలిపారు. వైఎస్సార్ జిల్లా కమలాపురం మండలం ఎర్రగుడిపాడుకు చెందిన ఏనుగ బాలమ్మగారి చెన్నారెడ్డి మంగళవారం ఉదయం 6.30–7.00 గంటల ప్రాంతంలో రైలు కిందపడి మృతి చెందాడన్నారు. మృతుడికి దాదాపు 69 సంవత్సరాల వయస్సు ఉంటుందని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు.

ఆర్మీ ఉద్యోగి అదృశ్యం


నాగార్జునరెడ్డి (ఫైల్)

కలసపాడు : మండలంలోని ముద్దిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బైరెడ్డి నాగార్జునరెడ్డి అనే ఆర్మీ ఉద్యోగి అదృశ్యమైనట్లు ఎస్ఐ తిమోతి తెలిపారు. ఆయన వివరాల మేరకు నాగార్జునరెడ్డి సెలవుపై ఇంటికి వచ్చాడు. ఏప్రిల్ 1వ తేదీన విధులకు వెళుతున్నానని ఇంటి వద్ద చెప్పి వెళ్లాడు. కానీ తాను పనిచేస్తున్న ఉత్తరాఖండ్ రెజిమెంటల్‌కు వెళ్లలేదని, ఇంటికి కూడా రాలేదని అతని తండ్రి మంగళవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నాగార్జునరెడ్డి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 9121100632 నంబర్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

సిద్దవటం : మండలంలోని ఎస్. రాజంపేట గ్రామ సమీప పొలాల్లో ఎర్రచందనం దుంగలను అక్రమ రవాణాకు సిద్ధం చేస్తుండగా సోమవారం రాత్రి టాస్క్‌ఫోర్స్, సిద్దవటం అటవీశాఖ, పోలీసు శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎస్. రాజంపేట గ్రామానికి చెందిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 9 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తిరుపతి తరలించి విచారిస్తున్నట్లు తెలిసింది.

ఆర్టీసీ కార్మికుల ధర్నా

రాయచోటి టౌన్ : నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం రాయచోటి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ధర్నా నిర్వహించారు. జిల్లా పరిధిలోని ఐదు డిపోలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

గుండెపోటుతో గుర్తు తెలియని ప్రయాణికుడి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

చింతకొమ్మదిన్నె : కడప నుంచి రాయచోటికి ఆర్టీసీ బస్సులో మంగళవారం ప్రయాణిస్తూ గుర్తు తెలియని ప్రయాణికుడు గుండెపోటుతో మృతి చెందాడని చింతకొమ్మదిన్నె పోలీసులు తెలిపారు. కడపలో ఆర్టీసీ బస్సు ఎక్కి రాయచోటికి టిక్కెట్ తీసుకొని బస్సులో వెళ్తుండగా, చింతకొమ్మదిన్నె మండలంలోని మూలవంక గ్రామం వద్దకు రాగానే ప్రయాణికునికి గుండెపోటు వచ్చింది. చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు 108లో తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతి చెందిన ప్రయాణికుని వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్‌ఎంపీ క్లినిక్ సీజ్


ఆర్‌ఎంపీ క్లినిక్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక శ్రీరాంనగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న సుబ్బయ్య ఆర్‌ఎంపీ క్లినిక్‌ను మంగళవారం వైద్యాధికారులు సీజ్ చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. చిన్న పిల్లలకు వైద్యం అందించడంతో పాటు రెండు బెడ్లను ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నట్లు వైద్యాధికారులు ఈ సందర్భంగా గుర్తించారు. దీంతో ఆర్‌ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేస్తున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏరియా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఆలీం, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఏఎస్ఐ


గాయపడిన వ్యక్తిని ఆటోలో తరలిస్తున్న దృశ్యం

చాపాడు : స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐ గా పని చేస్తున్న అహమ్మద్ బాషా మానవత్వం చాటుకున్నారు. మైదుకూరు – ప్రొద్దుటూరు జాతీయ రహదారిలోని నాగులపల్లె సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద శనివారం మధ్యాహ్నం బైకు స్కిడ్ అయి శివ అనే వ్యక్తి రోడ్డుపై పడ్డాడు. డ్యూటీ ముగించుకుని ప్రొద్దుటూరుకు వెళుతున్న ఏఎస్ఐ స్పృహ తప్పి పడిపోయిన శివకు సపర్యలు చేసి ఆటోలో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి ప్రొద్దుటూరు పట్టణం పెన్నానగర్‌కు చెందిన వాడిగా గుర్తించారు. గాయపడిన వ్యక్తిని సకాలంలో ఆదుకున్న ఏఎస్ఐను పలువురు అభినందించారు.

మహానాడుకు పటిష్ట భద్రతా ఏర్పాట్లు



సమీక్ష సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు

కడప అర్బన్ : కడప నగర శివార్లలో చింతకొమ్మదిన్నె పరిధిలో ఈనెల 27, 28, 29 తేదీలలో జరగనున్న 'మహానాడు' కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు పలువురు వీఐపీలు హాజరు కానున్న నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్.పి ఈ.జి. అశోక్ కుమార్ జిల్లాలోని పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎస్.ఎస్.జి ఎస్.పి ఆరిఫ్ హఫీజ్, ఎస్.ఎస్.జి డైరెక్టర్ నచికేత్ విశ్వనాథ్, ఎస్.ఎస్.జి ఎస్.పి జి.హెచ్ భద్రయ్యలతో కలిసి జిల్లాలోని పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహానాడు కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు రానున్న నేపథ్యంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అవాంతరాలు లేకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (పరిపాలన) కె.ప్రకాష్ బాబు, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్.సుధాకర్, కడప డీఎస్పీ జి.వెంకటేశ్వర్లు, ఏ.ఆర్. డీఎస్పీ కె.శ్రీనివాస రావు , ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు దారెడ్డి భాస్కర్ రెడ్డి, ఆర్. పురుషోత్తం రాజు, జిల్లాలోని సీఐలు పాల్గొన్నారు.

రేపు విద్యాభవన్ వద్ద ఉపాధ్యాయుల ధర్నా


సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా

కడప ఎడ్యుకేషన్ : ప్రాథమిక విద్యారంగాన్ని బలోపేతం చేస్తామన్న ప్రభుత్వం ఆ విషయాన్ని విస్మరించి విద్యారంగ విచ్ఛిన్నానికి పూనుకోవడాన్ని నిరసిస్తూ ఈనెల 15న విజయవాడ విద్యా భవన్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ తెలిపారు. మంగళవారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఉపాధ్యాయులందరూ పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఇప్పటి వరకు జీఓ 117 రద్దు చేయకుండా పాఠశాల వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తున్నామని చెబుతున్నారన్నారు. మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో ఎస్జీటీలకు పదోన్నతులు ఇచ్చి వారి ద్వారా భర్తీ చేయాలన్నారు. బదిలీల వ్యవస్థలో తీసుకు వస్తున్న మార్పులపై ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీకి 110 జీఓ అమలు చేయాలి


ట్రిపుల్ ఐటీ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని అన్ని ట్రిపుల్ ఐటీల్లో కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న ఉద్యోగులకు 110 జీఓను అమలు చేయాలని కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ అధ్యక్షుడు నజీర్‌హుసేన్ కోరారు. మంగళవారం ఆర్జీయూకేటీ పరిధిలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమారస్వామి గుప్తాను కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ ఉద్యోగులు కలిసి 110 జీఓను అమలు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో 2018 నుంచి పనిచేస్తున్న కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీకి జీఓ 110 అమలు చేయకపోవడం వలన జీతాలు తక్కువగా వస్తున్నాయన్నారు. 110 జీఓను అమలు చేసి 2018 నుంచి ఇప్పటి వరకు కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీలకు సర్వీసు కలపాలన్నారు. అలాగే సర్వీసు ఆధారంగా రావాల్సిన రూ.40వేలు జీతాలను ఇవ్వాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు జూన్ 11, 12, 13 తేదీల్లో ఆయా ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రేషనలైజేషన్ పేరిట పోస్టుల్లో కోత తగదు

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో రేషనలైజేషన్ పేరిట పాఠశాల సహాయకుల పోస్టులను ప్రాథమిక పాఠశాలలకు బదిలీ చేయడం తగదని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం 117 జీఓను తెచ్చి ప్రాథమిక తరగతులను ఉన్నత పాఠశాలల్లో కలిపిందన్నారు. దీనిని రద్దు చేస్తామంటూ ఎన్నికల ముందు హామీ ఇచ్చి ప్రస్తుతం 21 జీఓను తెచ్చి మిగులు పాఠశాల సహాయకులను మోడల్ ప్రాథమిక పాఠశాలలకు హెచ్‌ఎంలుగా పంపడం అన్యాయమన్నారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ ప్రకారం ప్రాథమిక తరగతులను కేవలం డీఎడ్ చదివిన ఎస్జీటీలు మాత్రమే బోధించాల్సి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం దీనికి విరుద్ధంగా జీఓ 21 విడుదల చేసి పాఠశాల సహాయకులను ప్రాథమిక పాఠశాలకు పంపుతోందన్నారు. అంతేకాకుండా ఇప్పటివరకు ఉన్న ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల స్థానంలో తొమ్మిది రకాల పాఠశాలలుగా వర్గీకరించారన్నారు. వీటిలో ఎక్కడా తెలుగు మాధ్యమం గురించి ప్రస్తావనే లేదన్నారు. ఈ నిర్ణయం వల్ల విద్యా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ఈ విషయాలపై ప్రభుత్వం పునరాలోచించి అందరికీ సహేతుకమైన నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు.

లారీ బోల్తాపడి డ్రైవర్‌కు గాయాలు


పులివెందులలోని అంబకపల్లె రోడ్డులో బోల్తా పడిన లారీ

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని అంబకపల్లె రోడ్డు సమీపంలో మంగళవారం ఉదయం మట్టిని తరలిస్తున్న లారీ బోల్తా పడింది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బెంగళూరు నుంచి మట్టిని తరలిస్తూ ప్రొద్దుటూరు వైపు వెళ్తున్న లారీ పులివెందుల రింగ్ రోడ్డు సమీపంలోని అంబకపల్లి రోడ్డు వద్దకు రాగానే బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స కోసం డ్రైవర్‌ను కడప రోడ్డులో ఉన్న ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అవయవదానంతో అందరికీ ఆదర్శం

- రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- బ్రెయిన్‌డెడ్ తర్వాత పలు అవయవాలు దానం


కొండారెడ్డి(ఫైల్)


కుమారుడి అవయవాలను దానం చేసిన తల్లిదండ్రులను ఓదారుస్తున్న ఆసుపత్రి సిబ్బంది

చిన్నమండెం : చిన్నమండెం మండలం చాకిబండ గ్రామం అంపాబత్తునివారి పల్లెకు చెందిన మద్దిరాల కంచంరెడ్డి, కోటేశ్వరమ్మ దంపతుల కుమారుడు మద్దిరాల కొండారెడ్డి(21) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతని అవయవాలు దానం చేసి మరి కొందరి ప్రాణాలను కాపాడి ఆ కుటుంబం అందరికీ ఆదర్శంగా నిలిచింది. స్థానికుల కథనం మేరకు.. మద్దిరాల కొండారెడ్డి బెంగళూరులో సివిల్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 8వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంలో అతను మృతి చెందాడు. వైద్యుల సూచనల మేరకు కొండారెడ్డి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అవయవాలు దానం చేసి మరికొందరి ప్రాణాలను నిలబెట్టే దిశగా ఆలోచించారు. కొండారెడ్డికి సంబంధించిన గుండె, లివర్, కిడ్నీలు తదితర అవయవాలు దానం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు.

కన్నవారి కలలు కల్లలైనా..

కుమారుడి చదువు కోసం తల్లిదండ్రులు కంచంరెడ్డి, కోటేశ్వరమ్మలు ఎన్నో ఏళ్లుగా కష్టపడి వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకున్నారు. కూలి డబ్బులతోనే కుమారుని, కుమార్తెను చదివించుకున్నారు. కుమారుడు కొండారెడ్డి సివిల్ ఇంజనీర్‌గా ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడనే సంతోషం ఆ కుటుంబానికి చాలా రోజులు నిలబడలేదు. విధి ఆడిన వింత నాటకంలో ఆ కుటుంబం ఉన్న ఒక్క కుమారుడిని పోగొట్టుకుంది. దీంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో పాటు చాకిబండ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇంతటి విషాదంలో కూడా వారు తమ కుమారుడి అవయవాలు దానం చేసి మరి కొందరి ప్రాణాలను కాపాడటం ఎంతో గర్వంగా ఉందని చెప్పడం అందరినీ కదిలించింది.

వైభవంగా రెడ్డెమ్మతల్లి పునః ప్రతిష్ట అంకురార్పణ


రెడ్డెమ్మతల్లి పునః ప్రతిష్ట అంకురార్పణ కార్యక్రమం

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన సంతాన ప్రదాయిని శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయంలో అమ్మవారి పునఃప్రతిష్ఠ అంకురార్పణ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఇటీవల అమ్మవారి ఆలయాన్ని రూ. 2.50 కోట్లతో పునర్నిర్మించారు. ఇందులో భాగంగా అమ్మవారి నూతన విగ్రహాన్ని ప్రతిష్టించే కార్యక్రమాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజైన మంగళవారం అమ్మవారి ఆలయంలో అంకురార్పణ ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రతిష్ఠ కార్యక్రమ దాతలు బొమ్మిశెట్టి రెడ్డి పరంజ్యోతి, మోడెం వీరాంజినేయప్రసాద్, సర్పంచ్ ప్రేమకుమారి,ఆలయ ఈఓ మంజుల పాల్గొన్నారు.